


శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర విద్యుత్ శాఖ సహాయమంత్రి రాజ్ కుమార్ సింగ్, టీం ఇండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లేలు దర్శించుకున్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థలో సమూల మార్పులు

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య : చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు అనేక కార్యక్రమాలను రూపొందించిందని చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్ర రావు అన్నారు. ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదవిద్యార్థులను బడికి రప్పించేలా ప్రోత్సహించేందుకు అమ్మఒడి కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంతో పాటు బూట్లు, బ్యాంగు, సాక్సులు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించడం జరుగుతోందన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద పేరుతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ఇటీవల ప్రభుత్వం మెనూలో తీసుకొచ్చిన మార్పులను కూడా అమలు చేయడం జరుగుతోంది. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన బైజూస్ కాంసెప్ట్ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తూ దీనికి అనుగుణంగా 8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. నాడు -నేడు మొదటి రెండవదశలో జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో మొదటిదశలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు పూర్తిచేసి రెండవ దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి రెండవ దశ పనులు కూడా పూరికానున్నాయని పేర్కొన్నారు.

ప్రజాశక్తి : నాడు- నేడు కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు?

డీఈఓ: నాడు- నేడు కింద మొదటి, రెండవ దశలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ముఖ్యంగా మరగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల నిర్మాణం, ప్రహరీగోడల నిర్మాణంతో పాటు పాఠశాలను ఆహ్లాదకరమైన వాతావరణం తీసుకొచ్చేందుకు పనులు చేపడుతున్నాం. ఇందు కోసం పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదం తప్పనిసరి అభివృద్ధి పనులు యాజమాన్య కమిటీ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ప్రజాశక్తి: అమ్మఒడి వర్తించాలంటే అర్హతలు ఏమిటి?

డీఈఓ: అమ్మఒడి కింద 75 హాజరు ఉన్న ప్రతి విద్యార్థి, తల్లి ఖాతాలకు రూ.15వేలు ప్రభుత్వం జమచేయడం జరుగుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు హాజరుశాతం తప్పనిసరిగా ఉండాలి.

ప్రజాశక్తి: జగన్న గోరుముద్ద అమలు తీరు ఎలా ఉంది?

డీఈఓ: జిల్లాలోని 2,475 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1,74,524 మంది విద్యార్థులు గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతోంది. నాణ్యమైన భోజనంతో పాటు వారిని ఐదు గుడ్లు, మూడు చిక్కీలు అందిస్తున్నాం. 8,355 స్వయం సహాయ సంఘాలచే మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.

ప్రజాశక్తి: మరుగుదొడ్ల నిర్వహణ కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

డీఈఓ: జిల్లాలోని 2,475 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ కోసం 4,933 మంది ఆయాలు పనిచేస్తున్నారు. వీరికి నెలకు గౌరవవేతనం కింద రూ.6వేలు అందించడం జరుగుతోంది.

ప్రజాశక్తి: బైజూస్ కాంసెప్ట్ ఏమిటి?

డీఈఓ: పేదవిద్యార్థులకు సైతం డిజిటల్ విద్యను అందుబాటులోకి తెస్తూ, తరగతి గదుల్లో చెప్పే పాఠాలను ఇళ్ళకు వెళ్ళాక కూడా పిల్లలు మరింత క్షుణంగా నేర్చుకునేందుకు వీలుగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఇందులో ఇంటర్నెట్ సౌకర్యం లేని విద్యార్థులకు ఆఫ్‌లైన్‌లో కూడా ఎక్కడైనా, ఎప్పుడైనా 24/7 పాఠ్యాంశాలు అందుబాటులో ఉండేలా, 8,9 తరగతుల కంటెంట్ మెమరీ కార్డు ద్వారా ట్యాబులలో ప్రీలోడ్ బైజూస్ ప్రీమియం యాప్ ద్వారా విద్యార్థులకు మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, జియాలజీ, సివిక్స్ సబ్జెక్టులలో అభ్యసన సులువుగా ఉండేలా ఇంగ్లీష్, తెలుగు భాషల్లో ఉచిత ఈకంటెంట్. ప్రతి చాప్టర్‌ను కాన్సెప్టులుగా విభజించి 67 చాప్టర్లు, 472 కాన్సెప్టులపై 300 వీడియోలు, 168 సాల్వ్‌డ్ క్వశ్చన్ బ్యాంక్‌లు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ బైజూస్ కల్లా నాడు-నేడు ఫేజ్-1లో పూర్తయిన 15,634 స్కూల్స్‌లోని 6వ తరగతి పైన 30,032 క్లాస్‌రూమ్స్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా చదువులు), ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్ళలో స్మార్ట్ టీవీల ఏర్పాటు దిశగా కృషి జరుగుతోంది.

కార్పొరేటర్ల దందాలను అరికట్టండి

ప్రెస్‌మీట్‌లో సిపిఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్
తిరుపతి నగరంలో ఆయా డివిజన్లో ప్రతి పనికి ప్రజల నుండి దందాలను వసూలు చేస్తున్న కార్పొరేటర్ల ఆగడాలను అరికట్టాలని నేడు యశోద నగర్ లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ప్రజలకు సేవ చేయాల్సిన కార్పొరేటర్లు ప్రతి పనికి డబ్బులు వసూలు చేసే సంస్కృతి తగదని అన్నారు. కార్పొరేటర్ల అనుమతి లేనిదే ప్రజలు ఇల్లు అమ్మడానికి లేదు, కొనడానికి లేదు, కొత్త ఇల్లు కట్టడానికి వీలు లేని పరిస్థితి ఉండడంవల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా కార్పొరేటర్లు ఈ దందాలకు పాల్పడడాన్ని సిపిఎం ఖండిస్తుందని తెలిపారు. ప్రతి పనికి లక్షల్లో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడి దోచుకుంటున్నారని అన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది కార్పొరేటర్లు దౌర్జన్యంగా పేదల భూములను ఆక్రమించుకొని, బాధితులను బెదిరిస్తున్నారని అన్నారు. జరుగుతున్న దందాలపై మున్సిపల్ కమిషనర్, మేయర్ స్పందించి తప్పు చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయం జరిగిన బాధితులకు సిపిఎం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. జరుగుతున్న సంఘటనలపై స్థానిక ఎమ్మెల్యే భూమన్ కరుణాకర్ రెడ్డి దష్టికి తీసుకెళ్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే వేణు, ఆర్ లక్ష్మి, పి. బుజ్జి, పి చిన్న, ఎం నరేంద్ర, ఆర్ మల్లికార్జున రావు, తంజావూరు మురళి, రఘు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి నగరపాలక సంస్థలో

"వసూళ్ రాజా" ల భరతం పట్టండి!

రాష్ట్ర ముఖ్యమంత్రి,స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ,మేయర్,కమిషనర్ కి,అధికార పార్టీ నాయకులకు తిరుపతి నగర ప్రజల తరపు మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.నవీన్ కుమార్ రెడ్డి ఆదివారం ప్రకటనలు విజ్ఞప్తి చేశారు.తిరుపతి మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థగా ఎదగడానికి ఎందరో మహానుభావులు మున్సిపల్ చైర్మన్ లుగా, కౌన్సిలర్లుగా నిస్వార్థంగా నిజాయితీగా పోటీలు పడి అభివద్ధి చేశారు అన్న విషయాన్ని నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలి. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో అభివద్ధి పరుగులు తీస్తున్నాయని ప్రతినిత్యం పత్రికల ద్వారా ప్రజలు గమనిస్తున్నారు, మరోపక్క స్థానిక ప్రజలు సొంత ఇంటి,వాణిజ్య సముదాయాల నిర్మాణాల కోసం వీధులలో "ఇసుక" "కంకర" దించిన వెంటనే "కొంతమంది" కార్పొరేటర్లు స్థానిక సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి చేసి వసూళ్లు చేస్తున్నారు అని బహిరంగంగా అధికార పార్టీ వారు ప్రకటించడంపై స్టేట్ విజిలెన్స్ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పారదర్శకమైన సుపరిపాలన అందిస్తామని,నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని పదేపదే ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగ అవకాశాలు లేక తక్కువ జీతాలకు సచివాలయ వ్యవస్థలో ఏనాటికైనా "రెగ్యులర్" అవుతామన్న ఆశతో పనిచేస్తున్న సచివాలయ సిబ్బందిపై వసూలు చేయాలని ఏ కార్పొరేటర్ ఏ అధికారి ఒత్తిడి చేస్తున్నారో నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు, అధికార పార్టీ పెద్దలు దష్టి సారించాల్సిన అవసరం ఉంది.తిరుపతి నగరపాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో అపార అనుభవం కలిగినటువంటి కార్పొరేటర్లు అధికార పార్టీ నుంచి రంగంలో ఉన్నారన్న నమ్మకంతో విశ్వాసంతో ప్రజలు పోటీలు పడి భారీ మెజార్టీతో గెలిపిస్తే "కొంతమంది కార్పొరేటర్" లు వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ప్రతిష్టను ప్రజలలో చులకన చేసేస్తున్నారు.

నగరపాలక సంస్థలో వసూళ్లకు పాల్పడుతున్న ఆ "కొంత మంది కార్పొరేటర్లు" పద్ధతులు మార్చుకోవాలని తిరుపతి నగర ప్రజల సహనాన్ని చేతకానితనంగా చూడొద్దని అవసరం అయితే ఎక్కడెక్కడ వసూళ్లకు పాల్పడుతున్నారో వారి జాబితా త్వరలో ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్దలకు అందజేస్తానని నవీన్ హెచ్చరించారు. తిరుపతి నగరపాలక సంస్థలో కొంతమంది చేస్తున్న అవినీతి గురించి ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారన్న విషయాన్ని అధికార పార్టీ నాయకులు గుర్తించాలి!.సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్న ఆ అధికార పార్టీ నాయకుల వసూళ్లకు చెక్ పెట్టి,సచివాలయ సిబ్బందికి భద్రత కల్పిస్తూ పారదర్శకమైన పరిపాలన అందించాలని తిరుపతి నగర ప్రజల తరపున డిమాండ్ చేస్తారు.

ఎన్సీఆర్సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కలవగుంట



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : జాతీయ వినియోగ దారులు హక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రముఖ సంఘ సేవకులు, తొట్టంబేడు మండల యువనేత కలవగుంట భరత్ రెడ్డిని నియమించారు. విజయవాడ నగరం గాంధీనగర్‌లోని అన్నపూర్ణ దేవి వీధిలో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో శనివారం జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వేడుకల్లో ఆ కమిషన్ ప్రధాన న్యాయమూర్తి సూర్యభాస్కరం చేతుల మీదుగా ఈ నియామక పత్రం అందుకున్నారు. ఈ వేడుకలకు గజల్ శ్రీనివాస్, సినీనటులు గీతం రఘు, సుప్రీంకోర్టు న్యాయవాది విల్లా దొరబాబు వంటి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుకల సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డికి ఎంతో కీలకమైన ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రం అందజేశారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్‌సీఆర్‌సి) వారు వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా తనదైన శైలిలో విస్తృతంగా పనిచేస్తున్న సంగతి మనకు తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ లో కూడా ఎన్ సీఆర్ సీ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సేవలు మరింత విస్తృతం చేసేందుకు ఎన్‌సీఆర్‌సీ కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా ఏపీలో నూతన కమిటీ నియమించిది. ఎంతో ప్రాధాన్యత గల ఈ కమిటీలో ఎంతో కీలకమైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలు యువకులైన కలవగుంట భరత్ రెడ్డికి అప్పగించారు. ఈయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. కలవగుంట భరత్ రెడ్డి మొదటి నుంచి సేవా భావం కలిగిన వ్యక్తి అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈయన తొట్టంబేడు మండల పరిధిలో నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి ప్రతి గ్రామంలో క్రికెట్ కిట్లు అందజేశారు. రాంబట్లపల్లె వద్ద ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం చుట్టూ ప్రస్తుతం సొబగులు దిద్దుతున్నారు. ప్రహరీ, ప్రత్యేక ముఖద్వారం, టైల్స్ వేయించారు. ఇక మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి యేటా ఉచితంగా నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి అందజేస్తున్నారు. పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సాయం కూడా చేస్తుంటారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు. కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌళిక వసతులు కల్పనకు ఈయన సొంత నిధులు వెచ్చించారు. ఇలా ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారు. ఈయన సేవాభావం గుర్తించిన జాతీయ వినియోగదారులు హక్కుల కమిషన్ వారు కలవగుంట భరత్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ... వినియోగ దారుల హక్కులు పరిరక్షించడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ పదవితో తనకు మరిన్ని బాధ్యతలు పెరిగాయన్నారు. ఈ పదవి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా కలవగుంట భరత్ రెడ్డికి ఎన్ సీఆర్ సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేయడంతో పాటు ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వ్యవస్థాపక జాతీయ ఛైర్మన్ ఎంవీఎల్ నాగేశ్వరరావు, ఏపీ ఛైర్మన్ బల్లా శ్రీనివాస్, డిప్యూటీ ఛైర్మన్ వెలంపాటి కోటేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డిని పరామర్శించిన నేతలు



ప్రజాశక్తి - క్యాంపస్ : ఇటీవల కాలంలో చంద్రగిరి ఎమ్మెల్యే తుడా ఛైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి సుబ్రహ్మణ్యం రెడ్డి మరణించారు. ఆయనను పరామర్శించే నిమిత్తం రాష్ట్ర మంత్రులు, మాజీ మంత్రులు, పిసిసి నేతలు పలువురు రాజకీయ ప్రముఖులు గురువారం తుమ్మలగుంటకు చేరుకున్నారు. రాష్ట్ర పర్యాటక క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా సుబ్రహ్మణ్యం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి వారి తల్లికి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తుమ్మలగుంటలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంటికి చేరుకున్న మాజీ మంత్రి, మాజీ పీసీసీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, మాజీ డీసీసీ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి సుబ్రమణ్యం రెడ్డి చిత్రపటానికి పూలు వేసి అంజలి ఘటించారు. మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరా రెడ్డి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్న భావోద్వేగానికి గురయ్యారు. తుమ్మలగుంటకు వచ్చినపుడల్లా తనను ఎంతో ఆప్యాయంగా పలుకరించే సుబ్రమణ్యం రెడ్డి భౌతికంగా దూరం కావడం జీర్ణించుకోలేకపోతున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రఘువీరా రెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేసిన మణిరెడ్డి తన మంచి మనస్సుతో రాజకీయ పార్టీలకు అతీతంగా ఎంతో మందిని ఆకర్షించారు. ఆ కుటుంబానికి భగవంతుడు తోడుగా నిలచి మనోధైర్యం కలిగించాలని తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసిన రఘువీరారెడ్డి, నరేష్ కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డిలు రాజకీయాలలో మణిరెడ్డితో తమకున్న అనుబంధం జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చివరగా ఎమ్మెల్యే చెవిరెడ్డి తల్లి మునిరత్నమ్మకు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్: డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ కానుక అందించడం జరుగుతుందని, అర్హత కలిగిన ఏ ఒక్క పెన్షన్ కూడా తొలగించడం జరగదని పథక సంచాలకులు, డిఆర్‌డిఏ పీడీ తులసి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ పింఛను కానుక పింఛనుదారులకు ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఈ జనవరి నుంచి పింఛను నగదు రూ.2500లను రూ.2750లకు పెంచడం జరిగిందన్నారు. దీనిని ఒక పండుగ వాతావరణంలో జనవరి 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ఏడు రోజులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సామజిక తనిఖీ నిమిత్తం మాత్రమే కొంతమంది పింఛనుదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. దీనిపై ప్రస్తుతం పత్రికల్లో వచ్చిన వార్తలపై ఎవ్వరూ పింఛను నిలిపివేస్తారన్న ఆందోళన, ఆపోహనలు అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన వారందరికీ పింఛను తప్పక ఇవ్వనున్నట్లు తెలిపారు. నోటీసు అందుకున్న పింఛనుదారులతో అర్హత కలిగిన వారు, వారి అర్హతకు సంబంధించిన ప్రతులను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలకు వెంటనే అందజేయాల్సిందిగా తెలిపారు. వీటిని ఎండిపిఓలు, మున్సిపల్ కమిషనర్లు క్షుణంగా తనిఖీ చేసి అర్హత కలిగిన పింఛనుదారులకి యథావిధిగా కొనసాగించడం జరుగుతుందన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

జైన్ సంఘం నేతృత్వంలో నిర్వహిస్తున్న ఉచిత కంటివైద్య శిబిరం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతినెలా చివరి ఆదివారం జైన్ సంఘం నేతృత్వంలో నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జైన్ సంఘం ప్రతినిధులు చాలా సంవత్సరాలుగా ప్రతినెలా చివరి ఆదివారం స్థానిక రాములగుడి వీధి జైన్ ప్రార్ధనా మందిరంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. జైన్ సంఘం ఉచిత కంటిపరీక్షలతో పాటు ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పిస్తోందని నగరంలోని పలువురు ప్రముఖులతో పాటు సామాన్య జనం అభినందిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన శిబిరంలో తిరుపతి అరవిందో ఐ ఆసుపత్రి వైద్యనిపుణులు 89మందికి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు 39మందిని ఎంపిక చేశారు.

సామాజిక సేవ ఎన్‌సిసిలో భాగమే

కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్.ప్రకాష్



ప్రజాశక్తి - క్యాంపస్ : డిగ్రీ చదువుతున్న విద్యార్థులు బి.సర్టిఫికెట్, సి.సర్టిఫికెట్ సంపాదించే నేపథ్యంలో ఎన్‌సిసి కార్యక్రమాలలో భాగంగా సామాజిక సేవ పరిసరాల పరిశుభ్రత కార్య క్రమాన్ని ఆదివారం నిర్వహించడం జరిగిందని కల్నల్ ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌వి ఆర్ట్స్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో తిరుపతి సమీపంలోని రాయల్ చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ జెండాని ఎగురవేసే సమయంలో పెరేడ్ నిర్వహించడమే కాకుండా ఆ పెరేడ్‌కు సంబంధించిన శిక్షణ మాత్రమే కాకుండా ఇతర సామాజిక, సాంఘిక, రాజకీయ సేవా అంశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎన్‌సిసి క్యాడెట్లు ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో పట్టుదలతో ఒక అంశాన్ని సంపూర్ణంగా పూర్తి చేయగలరని దేశవ్యాప్తంగా నిరూపిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరడం ద్వారా ఆర్మీ శిక్షణలో రాటుతేలి, నీతి, నిజాయితీ, నిబద్ధతకు మారుపేరుగా సమాజంలో జీవించడం జరుగు తుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ఎల్లప్పుడూ ఎన్‌సీసీ క్యాడెట్లు ముందుంటారన్నారు. దాదాపు ఒక సంవత్సరం క్రితం ప్రారంభించిన పునీత్ సాగర్ అభియాన్ ప్రదాన కార్యక్రమంలో ఒకటి అన్నారు. ఈ కార్యక్రమం కింద సముద్రతీరాలు, నీటి వనరులను శుభ్రం చేస్తున్నారు. ఈ కార్య క్రమం ప్రజలచే విస్తృతంగా ప్రశంసించబడింది, ప్రధానమంత్రి మన్కీ బాత్‌లో కూడా ప్రస్తా వించబడిందన్నారు. సేకరించిన సుమారు 200 కిలోల ప్లాస్టిక్, వ్యర్థాలను పరిశుభ్రం చేసి గ్రామపంచాయతీ చిట్టత్తూరు కల్లే పల్లి సర్పంచ్ మురుగయ్య ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఆర్ట్స్ కళాశాల సిటీఓ డా.కె.పురుషోత్తం నాయుడు, తిరుపతి గ్రూపుకు చెందిన 2ఏ ఆర్,విఆర్ ఈజిటి ఎన్సిసి కి చెందిన 70 మంది క్యాడేట్లు, ఎన్సిసి సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు కురుగొండ్ల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాశక్తి-వెంకటగిరి: పల్లెపల్లెకు మీ కురుగొండ్ల కార్యక్రమాన్ని వచ్చే నెలలో ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక తన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని తెలియజేశారు. రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకొని వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని రాబోవు ఎన్నికల్లో ప్రజలు ఆదరించాల న్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు తెలియజేస్తూ గ్రామ గ్రామానికి వెళ్ళి అభివృద్ధి అవసరాన్ని తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెటింగ్ చైర్మన్ పులుకొల్లు రాజేశ్వరరావు, డక్కిలి ఎంపిపి పోలంరెడ్డి వెంకటరెడ్డి, బాలాయపల్లి తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు కూరపాటి రామచంద్రయ్య, వెంకటగిరి మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, డక్కిలి మండల పార్టీ అధ్యక్షులు కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎంహెచ్‌ఒగా లోకేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
చిత్తూరు నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓగా డాక్టర్ పి.లోకేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.లోకేష్‌ను నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన ఆదివారం నగరపాలక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

బీసీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బుల్లెట్ సురేష్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏపి మొదలియార్ కార్పొరేషన్ ఆత్మీయ సమ్మేళనం చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ఈకార్యక్రమానికి మొదలియార్ సంఘం నాయకులు ఎన్.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను మొదలియార్ కార్పొరేషన్ చైర్మెన్ బుల్లెట్ సురేష్ ఘనంగా ఆహ్వానించారు. బిసి నాయకులు, మాజీ కౌన్సిలర్ బుల్లెట్ శ్రీనివాసన్ వర్ధంతి కూడా ఆదివారం కావడంతో సభలో ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బిసిలు, అందులోనూ మొదలియార్ కులస్తుల అభ్యున్నతి పట్ల ముఖ్యమంత్రి జగనన్నకు ఉన్న చిత్తశుద్ధి అపారమైనదని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో బిసిలకు పెద్దపీట వేయడమే ఇందుకు నిదర్శనమని కొనియాడారు. బుల్లెట్ సురేష్ మాట్లాడుతూ బిసిలకు మేలు చేయాలన్న తపనతోనే జగనన్న బిసి కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసారని అన్నారు. అనంతరం మొదలియార్ సామజకవర్గంలో సామాజికసేవ చేసిన సుమారు 1000మంది ప్రముఖులను సన్మానించి వారికి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ భాస్కర్, కార్పొరేటర్లు మురళి, నవీన్‌కుమార్, సహదేవన్, గణేష్, లక్ష్మణస్వామి, కార్పొరేషన్ డైరెక్టర్లు వీరరాఘవులు, శాంతి మల్లిఖార్జున, సుగుణమ్మ, బాలకష్ణ, చెంచు సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మనుధర్మశాస్త్ర పత్రాలు దహనం



ప్రజాశక్తి-పాకాల: స్థానిక అంబేద్కర్ భవన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ భవనం అధ్యక్షుడు ఆనందయ్య అధ్యక్షతన మను ధర్మ శాస్త్ర దహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతలతో నిండిన మను ధర్మ శాస్త్రాన్ని దహనం చేసినట్లు తెలిపారు. అంటరానితనం అవమానం అసమానతులకు నిలయమైన మనుధర్మ శాస్త్రాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1925 డిసెంబర్ 25న దహనం చేశారని అన్నారు. ఆయన మార్గంలో మనం మన శక్తి మేరకు కృషి చేయాలని, సత్యాన్ని సత్యంగా గుర్తించి నడవాలన్నారు. భవనం ఉపాధ్యక్షుడు ప్రభు, భవనం సభ్యులు శ్రీనివాసులు, రెడ్డప్ప, జగన్నాథం, నరసింహులు, శివప్రసాద్, గణేష్, ప్రభాకర్, యోగేంద్ర, జ్యోతి, నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం



ప్రజాశక్తి- పిచ్చాటూరు: మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ హేమలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలన విఫలమైందని, రాష్ట్రాభివృద్ధి ఎక్కడా కనపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కులానికి కార్పొరేషన్ పేరుతో పదవులు ఇచ్చారు కానీ నిధులు మాత్రం రూపాయి ఖర్చు చేయలేదని రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నూతన టిడిపి అధ్యక్షుడుగా ఎన్నికైనందుకు పార్టీ అధ్య క్షుడు తిరుమలరెడ్డి అధిష్టానం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం లోని ఏడు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రముఖ పారిశ్రామికవేత్త, తిరుపతి బీమాస్ హోటల్ వ్యవస్థాపకులు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. స్థానిక రాములవారి గుడి దక్షిణమాడ వీధిలో బ్రాహ్మణ సమాజానికి జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అజయ్ కుమార్ మాట్లాడుతూ భీమాస్ రఘు శ్రీవారు దేశానికి వచ్చే యాత్రికులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని సరసమైన ధరలకు అందించడంతోపాటు ఆధ్యాత్మికతను, సాహిత్య రంగ అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీమాస్ హోటల్స్ అధినేతలు బాలాజీ, అశోక్, పాల్గొన్నారు

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు రూరల్, గూడూరు: గూడూరు పట్టణ శివారులోని నెల్లటూరు జనార్ధన్నగర్లోని గిరిజన కాలనీలో సుమారు 25 గిరిజన కుటుంబాలకు బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సాయం అందించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ దశరథ రామారావు మాట్లాడుతూ గిరిజనులను గుర్తించి చలి తీవ్రతను తట్టుకోవడానికి బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మస్తాన్, మోహన్, అశోక్ వెంకీ తదితరలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు నవీన్పై కేసు నమోదు

ప్రజాశక్తి-పుంగనూరు:

వైసీపీ బ్యానర్లు ఏర్పాటు విషయంలో ఇరుపార్టీలు గొడవలు పడటంతో టీడీపీ నాయకుడు న్యాయవాది నవీన్ కుమార్ యాదవ్ పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా.. పుంగనూరు మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించిన పల్లె బాట కార్యక్రమంలో గడిదేసి గ్రామంలో వైసీపీ పార్టీ బ్యానర్లు కడుతుండగా టీడీపీకి చెందిన న్యాయవాది నవీన్ కుమార్ యాదవ్ తమ ఇంటి వద్ద బ్యానర్లు కట్టకూడదని చెప్పడంతో వివాదం జరిగింది. దీనిపై ఆ గ్రామంలో వైసీపీ, టిడిపి రెండు వర్గాల మధ్య గొడవలు జరిగాయి. దీనిపై పోలీసులు నవీన్ కుమార్ యాదవ్ పై కేసు నమోదు చేసి అతని అదుపులోకి తీసుకున్నారు. నవీన్కుమార్ యాదవ్;కుటుంబ సభ్యులపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. గాయపరచడమే కాకుండా నవీన్ యాదవ్ను అక్రమ అరెస్టు చేసి ఏ స్టేషన్లో ఉన్నారో అని తెలియకుండా కుటుంబ సభ్యులకు సైతం చూపించకుండా దాచి పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న పుంగనూరు టీడీపీ నాయకులు పోలీస్ స్టేషన్ కు వెళ్లి వివరాలు కోరితే వాళ్లని సైతం అదుపులోకి తీసుకొని స్టేషన్లో కూర్చోబెట్టారు. ఆగ్రహించిన టీడీపీ నాయకులు స్టేషన్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర నేత శ్రీకాంత్, సివి రెడ్డి ,గిరిబాబు ,చిన్న మోహన ,నూర్ భాషా, సద్దాం ,నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టం బోర్డుపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం:

మండలంలోని గుంతూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులోని పేర్లు మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు బదిలీ అయినా పేర్లను అలానే కొనసాగిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



పుత్తూరుటౌన్లో..

ప్రజాశక్తి- పుత్తూరుటౌన్: పుత్తూరు పట్టణం మండీ వీధిలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చిలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి రోజా, ఆమె సోదరుడు రాంప్రసాద్రెడ్డి హాజరయ్యారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మంత్రి ఆర్.కె.రోజా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పేదలకు దుస్తుల పంపిణీతోపాటు క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏసుక్రీస్తు మహిమతో అందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, వైసీపీ నాయకులు, చర్చి పాస్టర్లు పాల్గొన్నారు.


తిరుపతి(మంగళం): ప్రపంచ మానవాళి పాప విమోచన కోసం, లోక రక్షకునిగా భువికి దిగివచ్చిన యేసుక్రీస్తు జన్మదిన వేడుకలను తిరుపతి నగర పరిధిలోని కెబి లేఔట్లోని షేకినా



ప్రార్ధన మందిరంలో ఆదివారం సీనియర్ పాస్టర్ అరుల్ అరసు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జోయల్, క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో యువకులు ప్రత్యేక క్రిస్మస్ గీతాలను ఆలపించారన్నారు. పిల్లల చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. వందల మంది క్రైస్తవులు ఉదయం 7 గంటల నుంచి12 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారన్నారు. ఒకరికొకరు క్రిస్మస్ శు భాకాంక్షలు తెలుపుకుంటూ కేక్ లు పంచుకున్నారన్నారు. ఈ ప్రార్థనల్లో సంఘ పెద్దలు బాబురావు, జాషువా, మోషే, దయాలన్, రఘు, తదితరులు పాల్గొన్నారు.




'ఆంగెల్ కాన్ చర్చ్ ఆఫ్ ఇండియా' చర్చిలో..



బిఎన్కండ్రిగలో..

'ఆంగెల్ కాన్ చర్చ్ ఆఫ్ ఇండియా' చర్చిలో.. తాటి తోపులోని అంగెల్ కాన్ చర్చ్ ఆఫ్ ఇండియాలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్చి బిషప్ ఎస్.వేదనాయగం ఆధ్వర్యంలో దేశం సంక్షేమం కొసం, ప్రజలందరూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వేయి మంది పేదవాళ్లకు వస్త్రాలు, అన్నదానం చేశారు. ఈ క్రిస్మస్ వేడుకల్లో వేద నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ దేవి, రెవరెండ్ హేమంత్ కుమార్, రేవరణ్ దేవన్న, రెవరెండ్ అగస్టిన్, రెవరెండ్ ఆనంద్ కుమార్, అడ్వకేట్ దొరబాబు, షేక్ సయిద్ తదితరులు పాల్గొన్నారు.

బిఎన్కండ్రిగ: మండలంలోని పలు గ్రామాల్లో



ఓజిలిలో..



చిన్నగొట్టిగల్లులో..

భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. అన్నదానాలు, వస్త్ర దానాలు చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ రోహి, జితేంద్ర, మురళీ, కిషోర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి : మండలంలోని పలుచోట్ల ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి. చర్చిలో పాస్టర్ రాజరత్నం, డాక్టర్ అంకయ్య దైవ సందేశాన్ని అందించారు. ఓజిలి సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి వద్ద సోమవారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చిన్నగొట్టిగల్లు:మండలంలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్



వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. భాకరాపేట గీతాంజలి, సాయిరామ్ స్కూళ్లలో క్రిస్మస్ సందర్భంగా శాంతాక్లాజ్ విద్యార్థులు వేషధారణతో అందరిని ఆకర్షించారు. కరస్పాండెంట్లు గిరికుమార్ రెడ్డి, జనార్దన్ రెడ్డి విద్యార్థులకు చాక్లెట్లు, మిఠాయిలు పంచారు.

దొరవారిసత్రం : మండల కేంద్రంలోని లూథరన్ చర్చి, ఏకొల్లు ప్యారిస్కు చెందిన ఏకొల్లు దొరవారిసత్రం కుప్పారెడ్డిపాలెం నెలబల్లి రామారెడ్డి గ్రామ పరిధిలో ఉన్న నూతన చర్చిలలో ఆదివారం ఘనంగా క్రీస్తు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. చర్చిపాస్టర్ రవికుమార్ క్రీస్తు జననం గురించి లూథరన్ చర్చి సంఘస్తులకు బోధిస్తూ ప్రత్యేక ప్రార్థనలను జరిపారు. సాంస్కృతి కార్యక్రమాలు నాటికలు ప్రదర్శించిన వారికి బహుమతులను పిసిసి ఛైర్మన్ జయంత్ కుమార్ చేతుల మీదుగా అందించారు. మైకెల్ విజయ్ కుమార్ జాన్సన్, యూత్ ప్రవీణ్ రాయల్, చిన్న, మోహన్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి – పుత్తూరుటౌన్ : పట్టణంలోని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ హైస్కూలు, జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులు అయిన డాక్టర్ ఆరుముగం చిన్న పిల్లల వైద్య నిపుణులు వైద్యులు, డాక్టర్ భాస్కర్ రెడ్డి, రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఏపీ. దొరస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పదవీ విరమణ పొంది కుప్పయ్య శివలింగం, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, పెరుమాళ్లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వాళ్ల గురువులను తల చుకుంటూ వాళ్ళ చిత్తశుద్ధిని అంకిత భావాన్ని కొనియాడారు. త్వరలో తాము చదువుకున్న కళాశాలకు, పాఠశాలకు చేయవలసిన సేవా కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. తదుపరి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు, కార్యక్రమ నిర్వాహకులు ఏ.రఘు పతి, ఎస్.అపరంజి, బాబురావు, వీఎం మహీన్, కేటీ.ప్రసాద్ రెడ్డి, డి.జయప్రకాష్ పాల్గొన్నారు..

సాగు భూముల్లో మైనింగ్కు అనుమతివ్వద్దు

ఊనుగుంటపాలెం గ్రామస్తుల ఆవేదన



ప్రజాశక్తి-కోట: చిల్లకూరు మండలం మోమిడి రెవెన్యూ పరిధిలో ఊనుగుంటపాళెంలో పేద ప్రజలు సాగు చేసుకుంటున్న పొలాలలో అక్రమంగా నిబంధనలకు వ్యతిరేకంగా మైనింగ్ మాఫియాకు అనుమతులు ఇచ్చారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం బీజేపీ నాయకులు ఊనుగుంట పాలెం గ్రామస్తులుతో కలిసి భూములును పరిశీలిం చారు. గ్రామస్తులు మైనింగ్ వద్దు అని వ్యతిరేకిస్తున్నా కూడా పర్మిషన్ ఇవ్వడంలో అధికారులకు ఎంతవరకు న్యాయం, ఇదేనా పేద ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వమని బిజెపి నాయకులు ఎద్దేవా చేశారు. ఎక్కడ విన్న ఇసుక దోపిడీ అదే రీతిలో మైనింగ్ ఎక్కడపడితే అక్కడ పర్మిషన్ ఇవ్వడం ఈ ప్రభుత్వానికే చెల్లుబాటని బిజెపి నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, బిజెపి సీనియర్ నాయకులు పురుషోత్తమ రెడ్డి,చిల్ల కూరు మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, గూడూరు టౌన్ అద్యక్షులు బాలకృష్ణం నాయుడు, కార్యవర్గ సభ్యులు ప్రవీణ్ రెడ్డి , నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

బోయకొండలో అన్నదానానికి రూ.15 వేలు విరాళం



ప్రజాశక్తి- చౌడేపల్లె : రాష్ట్రంలో రెండో ప్రముఖ శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి ఛైర్మన్ మిద్దింటి శంకర నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కడపకు చెందిన మద్దిరెడ్డి ప్రసన్న, కొండా శ్రావణ్ కుమార్రెడ్డి రూ.15 వేలు విరాళంగా అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ధర్మకర్త మండలి సభ్యులు జె.వెంకట్రమణరెడ్డి, ఈశ్వరమ్మ, దేవస్థాన అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం



ప్రజాశక్తి – పుత్తూరుటౌన్: మహిళా సాధికారత తోనే దేశాభివృద్ధి సాధ్యమని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని దీనదయాళ్ అంత్యోదయ యోజన నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్యాశాఖ (సీసీఈ) సంయుక్త సౌజన్యంతో కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కందేరి శ్రీదేవి ఆధ్వర్యంలో గత నాలుగు వారాల పాటు మహిళా చైతన్యంపై జరిగిన వివిధ కార్యక్రమాల ముగింపు సమావేశం శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళా సాధికారతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం విభిన్న కార్యక్రమాలకు శ్రీకారం చుడు తోందన్నారు. మహిళా చట్టాలు, మహిళల సంక్షేమ పథకాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కన్వీనర్ డాక్టర్ కందేరి శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం గత నాలుగు వారాల పాటు "స్త్రీలపై లింగవివక్ష, బాల్యవివాహాలు, గృహహింస, లైంగిక వేధింపులు" తదితర అంశాలపై ర్యాలీలు, అవగాహన సదస్సులు, క్రీడాపోటీలు, రంగోళి తదితర కార్యక్రమాలను నిర్వహించానున్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్ళు వీరయ్య, కోటేశ్వరయ్య, అధ్యాపకులు రాధిక, స్వాతి, దేవకి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

'సమిష్టిగా పనిచేస్తే టీడీపీదే విజయం'

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలో ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో సెక్షన్ ఇన్ఛార్జిల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమిష్టిగా అందరూ కలిసి పనిచేస్తే ఈసారి గెలుపు రాష్ట్రంలో టీడీపీదేనన్నారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపించేలా కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో పనిచేయాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు టి.ఎం.బాబునాయుడు, క్లస్టర్ ఇన్ఛార్జిలు జీఎం రాజు, హేమాంబార్గౌడు, మాజీ జడ్పీటీసీ బేటప్ప నాయుడు, యూనిట్ ఇన్ఛార్జి అరుణాచలం, రామచంద్ర, ప్రకాష్, ఉదయ్కుమార్, వెంకటేష్, పార్టీ నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాహు-కేతు పూజల్లో అనిల్ కుంబ్లే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నిర్వహించే రాహు-కేతు సర్పదోష నివారణ పూజల్లో ఆదివారం మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే కుటుంబసభ్యులతో కలసి పాల్గొన్నారు. మొదట శ్రీకాళహస్తి శాసన సభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి ఆలయ దక్షిణగోపురం వద్ద సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనిల్ కుంబ్లే కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక రాహు-కేతు సర్పదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం గురుదక్షిణా మూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో క్రమశిక్షణను అలవర్చుకోవచ్చు



ప్రజాశక్తి -కోట: చిల్లకూరు మండలంలోని గుత్తవారిపాలెం దగ్గర ఉన్న శివానంద ఆశ్రమంలో మానవాళికి సంబంధించి అత్యుత్తమైన క్రమశిక్షణతో మెలగడానికి కావలసిన యోగ, మెడిటేషన్, ఆధ్యాత్మిక చింతనతో పాటు సత్ప్రవర్తనతో మనిషి సంతోషంగా హాయిగా జీవించడానికి కావలసిన మెలకువులతో కూడిన విద్యను నేర్పించడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా ఒక నెల రోజుల పాటు జరిగిన శిక్షణలో వారికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో పరిసర గ్రామాల వారు ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని శివనంద ఆశ్రయం సిబ్బంది తెలిపారు.

పాలసముద్రంలో మోస్తరు వర్షం



ప్రజాశక్తి-పాలసముద్రం: పాలసముద్రం మండలంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. వర్షపు నీరు నిండిపోవడంతో పిల్లలను చెరువులు, వంకలు వద్దకు వెళ్లకుండా చూసుకోవాలని అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు. వర్షాలు సంవృద్ధిగా కురుస్తుండటంతో బీడు భూముల్లో పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీ సూళ్ళూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

దావా నెంబరు : 86/2022

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూళ్ళూరుపేట బ్రాంచ్ -1 , Rep by its మేనేజర్ ... వాది

Vs

వల్లూరు వెంకటేష్ తండ్రి పోలయ్య

టు

వల్లూరు వెంకటేష్ తండ్రి పోలయ్య
R/o హరిజన వాడ, తనియాలి గ్రామము, దొరవారిసత్రం మండలం, తిరుపతి జిల్లా.

ఆక్షేపణ నోటీసు

ఇందుమూలముగా మీకు తెలియజేయడమేమనగా పై వాది మీ మీద దావా వేసి మీకు పలుమార్లు నోటీసులు పంపినను జారీ కానందున పై శ్రీ కోర్టు వారు మీకు నోటీసులను జారీ చేయమని కోరుతూ, మీ హాజరు నిమిత్తం వాయిదా తేదీ 06.01.2023న వేసియున్నారు. కావున మీరు ఆ రోజు ఉదయం10.30 గం॥లకు హాజరై మీకున్న ఆక్షేపణలను స్వయంగా గానీ, మీ ప్లీడరు ద్వారా గానీ తెలుపుకొనవచ్చును. లేనిచో మీకు వరోక్షముగా ఏమియూలేదని పై దావాలో కోర్టు వారు తీర్మానించెదరు.

P.D. BALARAJU, B.A., LL.B.,
Adcocate, Sullurpeta, Tiruapti District.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి జాతీయ రహదారిపై కారు బోల్తా పడి మహిళ మృతిచెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ కాకరపాలెం గ్రామానికి చెందిన కాత్రేనికోన ఉదయభాస్కర్, సీతామహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, రామ సింధుషా కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 19న విజయవాడ నుంచి కారులో రామేశ్వరం తీర్థయాత్రకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఓజిలిరాచపాళెం జాతీయ రహదారి వద్ద వంతెనను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో సీతామహాలక్ష్మి(53) మృతిచెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవలు కోసం 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. నాయుడుపేట రూరల్ సీఐ వైవీ సోమయ్య , ఎస్ఐ ఆదిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువశ్రీ మురళికి పితృవియోగం



ప్రజాశక్తి-బిఎన్కండ్రిగ: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు, రచయిత, తెలుగు భాషోద్యమ నేత యువశ్రీ మురళి తండ్రి సుబ్రహ్మణ్యం శనివారం అకాల మరణంతో మండలంలోని కనమనంబేడు గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్టీయూ నాయకులు గంటా మోహన్, కష్టారెడ్డి, ఢిల్లీ ప్రసాద్, కన్నయ్య, రమణారెడ్డి, పవన్ కుమార్రెడ్డి, యువరాజు, రామచంద్రయ్య, సుధాకర్, విజయభాస్కర్, మల్లికార్జున్, గజేంద్ర, శ్రీనివాసులు, తెలుగు భాషోద్యమ నేతలు సాకం నాగరాజ, వాకా ప్రసాద్లతో పాటు సీపీఐ నాయకులు రామానాయుడు, కత్తి రవి, కత్తి ధర్మయ్య, జనమాల గురవయ్య, జనార్దన్, ఉదయ్ కుమార్ ,చలపతి, నవీన్, వైసీపీ నాయకులు అజయ్ కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులు మధునాయుడు తదితరులు నివాళులు అర్పించారు.

దుకాణం షట్టర్ పగలగొట్టిన దొంగలు



ప్రజాశక్తి – పుత్తూరుటౌన్: పుత్తూరు పట్టణం తిరుపతి రోడ్డులోని శ్రీధనలక్ష్మి ఫ్యాషన్స్ దుకాణంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు షట్టర్ పగలగొట్టారు. తాళాలు పగలగొట్టినా షట్టర్ తీయడంలో విఫలమై వెనుతిరిగారు. పుత్తూరు పట్టణంలో వరుస దొంగతనాలు, పుత్తూరు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత మూడు నెలల ముందు హరి ఫార్మసీ షట్టర్ పగలగొట్టడం కొంతమంది తీసుకువెళ్లడం, తర్వాత స్వర్ణ లేఔట్లో హరిచంద్ర ప్రసాద్ ఇంట్లో దొంగతనం కొంత బంగారం నగదు తీసుకెళ్లడం, అంతేకాకుండా పట్టణంలో అక్కడక్కడ చిన్న దొంగతనాలు జరుగుతున్నాయి. వరుస దొంగ తనాలతో పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా పోలీసుల అప్రమత్తమై దొంగతనాలు జరగకుండా చూడాలని పోలీసు వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



ప్రజాశక్తి – పుత్తూరుటౌన్ : పట్టణంలోని పుత్తూరు మున్సిపాలిటీ గేట్ పుత్తూరుకు చెందిన రాష్ట్ర తెలుగు యువత మీడియా కో-ఆర్డినేటర్ డి.జి.ధనపాల్ తల్లి డి.జి.కృష్ణవేణి అనారోగ్యంతో మరణించారు. నంది మంగళం దళితవాడకు చెందిన తెలుగుదేశం కార్యకర్త నీలమ్మ మరణించారు. వీరి కుటుంబ సభ్యులను నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్. పూలమాలవేసి నివాళులర్పించి పరామర్శించారు. వీరి మృతికి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు డి.ఎస్.గణేష్, చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, పుత్తూరు పట్టణ అధ్యక్షులు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి, సోము, బాబు నాయుడు, వేలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి గ్రామంలోని రాయల్ మహల్ వద్ద కుప్పం నుండి మదనపల్లికి వెళ్తున్న బొలేరో, పన్నుసముద్రం నుంచి బోరుగూరుకు వెళుతున్న సుమో అదుపుతప్పి జాతీయ రహదారిపై ఎదురురెదురుగా ఢీకొన్నాయి. బొలేరో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న శ్రీనివాస హోటల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు.

ఎస్ఆర్పురం: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఎస్ఆర్పురం మండలంలో ఆదివారం జరిగింది. జీఎంఆర్ పురం వాగు వద్ద చెరకు ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో పెరుమాళ్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

In the court of the IV Additional District Judge: Tirupati
O.E.P.No. 92/2022, O.S.No. 179/2013
A.Karunakar S/o A.Raghava Reddy, Panjali Ramaniyam Apartment 5C, 5th Floor, Chennai, Tamil Nadu ...Decree Holder
V/s
D.Mahalakshmi W/o D.Umamaheswara Reddy, Maruthi Nagar, Korlagunta, D.No.469/C5, Now R/o D.No.138A, T.K.Street, Pasuparthi Super Market Upstairs, Tirupati ...Judgement Debtor

వేలం ప్రకటన

పై అడమానపు డిక్రీ వసూలు నిమిత్తమై దిగువ కనిన దాఖలా ఆస్థిపై పై కనిన కోర్టు నందు 18.01.2023న ఉదయం 10.30 గం॥ నుండి సాయంత్రం 5.00 గంటల వరకు బహిరంగ వేలము వేయబడును. కోర్టు వారి వేలము షరతులకు లోబడి పై ఆస్థిని ఎవరైనా వేలములో పాల్గొని కొనుగోలు చేయవచ్చును.

వేలము తేది. 18.01.2023

ఆస్థి వివరం

ఐటమ్ నెం.1 చిత్తూరు జిల్లా – శ్రీ బాలాజి రి.డి., తిరుపతి – రేణిగుంట సబ్ డిస్ట్రిక్టు, తిరుపతి అర్బన్ మండలం, నెం.27, తిమ్మినాయుడుపాళెం గ్రూపు మరియు తిమ్మినాయుడుపాళెం గ్రామ లెక్కదాఖలా, స.ఖు.సర్వే నెం.295 – డి.వి.రెడ్డి నగర్, నాగ రాఘవ నిలయం అపార్టుమెంటు మరియు ఆరంజ్ హోమ్స్, చెక్కుబంది వివరం **తూర్పు:** బిడ్ల చెంగమ్మ గారి భూమి, **పడమర:** ఆదెం చెంచురెడ్డి గారి కుమార్తె భూమి, **ఉత్తరం:** 40 అడుగులు వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** నాగయ్య మరియు ఇతరుల భూమి, ఈ హద్దుల మధ్య తూర్పు – పడమర ఉత్తరపు వైపు 128 అడుగులు లేక 39.040 మీటర్లు, తూర్పు – పడమర దక్షిణము వైపు 129 అడుగులు లేక 39.345 మీటర్లు, ఉత్తర – దక్షిణం తూర్పు వైపు 204 అడుగులు లేక 62.18 మీటర్లు, ఉత్తర – దక్షిణం పడమర వైపు 173 అడుగులు లేక 52.73 మీటర్లు మొత్తం 24630.48 చదరపు అడుగులు లేక 2736.72 చదరపు గజములు గల ఖాళీ స్థలము.

ఐటమ్ నెం.2: ఎ–షెడ్యూలు ఆస్థి యందు 1/50వ భాగపు విస్తీర్ణం 54.73 చదరపు గజములు విస్తీర్ణం గల ఖాళీ జాగా.

ఐటమ్ నెం.3: పై తెలుపబడిన 1/50వ భాగపు ఆస్థి నాగరాఘవ నిలయం అపార్టుమెంటు తూర్పు వైపు మొఖము గల ప్లాటు నెం. 410 విస్తీర్ణం 1040 చదరపు అడుగులు విస్తీర్ణం గల ఫ్లాట్లుకు చెక్కుబంది వివరము **తూర్పు:** కామన్ కారిడార్, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై మరియు స్టెయిర్కేస్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై

డిక్రీ హోల్డర్ వ్యాల్యు రూ. 20,00,000/-, అమీనా వాల్యు రూ. 30,00,000/-

ఎం.విజయ కుమార్, అడ్వకేటు, తిరుపతి. సెల్: 9963971551